క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

చిలుకూరు : గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం చిలుకూరు మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కట్టెకోల శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా తిరుగుమల్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సాకి మట్టయ్య, కోశాధికారిగా గుగులోతు దానియాతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలోని రామాలయం ఐదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వామివారి కల్యాణం, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

హుజూర్‌నగర్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు రూ. వెయ్యి వేతనం పెంచడమనేది కంటి తుడుపు చర్య అని అన్నారు. ఏపీలో ఇస్తున్న విధంగా వారికి నెలకు రూ.21 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చేపల కోసం చెరువు నీరు తొలగింపు




లింగగిరిలో తూము ద్వారా వృథాగా పోతున్న చెరువు నీరు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రతిరోజూ రాత్రి సమయంలో తూము ద్వారా షట్టర్‌ను పైకి లేపి చెరువు నీటిని బయటకు వదులుతూ వృథా చేస్తున్నారని మంగళవారం స్థానికులు తెలిపారు. చెరువులో నీటిని బయటకు వదలడంతో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెరువు నీటిని బయటకు వదులుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని వృథా అవుతున్న నీటిని అరికట్టాలని వేడుకున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

మోతె : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూడలి సర్పంచ్ పానుగోటి నర్సింహారావు అన్నారు. మంగళవారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సతీష్, సైదులు, శోభ, భవాని, ఉపసర్పంచ్ భూక్య మల్సూర్, వార్డు సభ్యులు భర్మావత్ మౌనిక, రవి, బర్మావత్ స్వప్న, నాను, గుజ్జ లక్ష్మి, గ్రామ పెద్దలు సంగెం లింగయ్య, వెంకటేశ్వరరావు, పాప తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన యువకులు



యువకులను సీపీఐలోకి ఆహ్వానిస్తున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పలు వార్డులకు చెందిన యువకులు మంగళవారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రావుల సత్యం, లక్ష్మి, శ్రీనివాస్, అంజయ్య, శ్రీరాములు, మధార్, నాగయ్య, అంజి తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మఠంపల్లి విద్యార్థి ప్రతిభ



మహదేవ్

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెంకు చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి మాలోతు మహదేవ్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో 154వ ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తండ్రి మాలోతు నాగునాయక్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మహదేవ్‌ను పలువురు అభినందించారు.

రోడ్డు శిథిలం.. ప్రయాణం నరకం

- కంకర తేలి, గుంతలమయమైన సిరికొండ- రావిపహాడ్ రోడ్డు
- దారిని కమ్మేసిన కంపచెట్లు
- వానొస్తే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు
- అవస్థలు పడుతున్న ప్రజలు



కంకర తేలిన సిరికొండ- రావిపహాడ్ గ్రామాల మధ్య రోడ్డు

మోతె : మండల కేంద్రం నుంచి ఆత్మకూర్ (ఎస్) మండలం బొప్పారం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రహదారి గుంతలమయంగా మారింది. కంకర తేలింది. దీంతో గత ముప్పై ఏళ్ల నుంచి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ సీజన్‌లో నరకయాతన అనుభవిస్తున్నారు. మండల కేంద్రం నుంచి సిరికొండ, రావిపహాడ్ గ్రామాలను కలుపుకొని ఆత్మకూర్ (ఎస్) మండలం బొప్పారం గ్రామంలో నూతనకల్ మండల కేంద్రానికి వెళ్లే లింకు రోడ్డు కలుస్తుంది. సుమారుగా 18 కిలోమీటర్ల దూరం వరకు ఉంటుంది. అయితే వర్షకాలంలో గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. కాగా గత మూడు సంవత్సరాల క్రితం సిరికొండ నుంచి రావిపహాడ్ మీదుగా బొప్పారం గ్రామం వరకు బీటీ రోడ్డుగా నిర్మించుటకు సంబంధిత అధికారులు ప్రణాళికలు వేశారు. కానీ నేటికి అతీగతి లేదు.

తీరని వాగు సమస్య..

కాగా, రావిపహాడ్ -సిరికొండ గ్రామాల మధ్యలో వాగు ఉంది. దీంతో రావిపహాడ్ చెరువు అలుగు పోస్తే ఈ వాగు దాటలేరు. రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్లుగా వేడుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు కనికరించడం లేదు. ఈ వాగు నుంచి వరద నీరు విభళాపురం గండ్ల చెరువులోకి నీరు చేరుతుంది. వర్షాకాలంలో రైతులు వాగు దాటి వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. ఇక వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రావిపహాడ్‌నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లాలంటే కాసిగూడెం వెళ్లాల్సి వస్తుందని ప్రజలు



రావిపహాడ్ వాగు దాటుతున్న కూలీలు

చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు, వాగు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలి



గుంతలమయమైన రావిపహాడ్ రోడ్డుపై వ్యవసాయ పనులకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలో అడుగుపెట్టలేక పోతున్నాం. మరోపక్క రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు కమ్మేయడంతో దారి అధ్వానంగా తయారైంది. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కంపచెట్లు తొలగించి రోడ్డు బీటీరోడ్డుగా మార్చాలి

– కొత్తపెల్లి సత్యమ్మ రైతు, రావిపహాడ్

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



వర్షాకాలంలో సుమారుగా 5 అడుగుల లోతైన రావిపహాడ్ వాగు నుంచి ఈదుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. పశువులు సహితం వాగులో నుంచి ఈదుకుంటూ బయటికి వెళ్లాలి. వరద ఉధృతి ఎక్కువగా ఉంటే రెండు మూడు రోజులు వాగు దాటడానికి వీలుండదు. వాగుపైన బ్రిడ్జి నిర్మిస్తే కష్టాలు తీరుతాయి. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలి.

– కోడి సోమయ్య, రైతు, రావిపహాడ్

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మఠంపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మోతె : అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిని రాజ్యశ్రీ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరడవాయి, విభళాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేయాలని నిర్వాకులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మన్సూర్‌అలీ, సర్వారం పీఏసీఎస్ సీఈఓ దోసపాటి ఉపేందర్, రెతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మఠంపల్లి : మండలంలోని బీల్యానాయక్‌తండాలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఐకేపీ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీఓ, సివిల్ సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి లారీలను సమయానికి పంపించాలని, గోనె సంచుల ఎగుమతి మరింత పెంచాలని కోరారు. అవసరమైతే స్థానికంగా గల సిమెంట్ ఫ్యాక్టరీలకు చెందిన లారీలు తెప్పించాలని ఆమె కోరారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ కొండానాయక్, శ్రీను, వెంకటేశ్వర్లు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మఠంపల్లి: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని పెదవీడు పరిధిలోగల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి మాట్లాడారు. అకాలవర్షాలు కురుస్తున్నందున రైతులు పండించిన వరిధాన్యం ఐకేపీ సెంటర్‌లలో తడుస్తూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, నరసింహనాయక్, సాంబానాయక్, పద్మ, బీమానాయక్, నాగులు, సుజాత, చంద్రయ్య, రంగానాయక్, భిక్షానాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం



స్వామివారి విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

గరిడేపల్లి : మండలంలోని ముత్యాలనగర్‌లో శ్రీరామాంజనేయస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో 1008 బిందెలతో విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవ కలశ స్నాపనం, జలాధివాసం గ్రామంలో బలిహరణ ధాన్యాధివాసం, నీరాజనం, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలను పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ, శ్రీరామయ్యశర్మ, రాజశేఖర్, రాధాకృష్ణ, భద్రయ్య, సాయి, ఫణికుమార్‌శర్మ, మోహన్, అనీల్, దివాకర్‌ల వేదమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన మాశెట్టి ఆదినారాయణ, మంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మాశెట్టి పద్మ కృష్ణయ్యలు స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన చలి వేంద్రం వద్ద మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులొచ్చినా మాకు ఇవ్వడం లేదు

- సీఎంఆర్‌ఎఫ్ మంజూరై నెలలు గడుస్తున్నా పంపిణీ చేయలేదని లబ్ధిదారుల ఆవేదన



బాధితులు మోహన్‌రావు, వీరయ్య

చిలుకూరు : తమకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరై నెలలు గడుసున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు నేటికీ చెక్కులు పంపిణీ చేయడం లేదని మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మోహన్‌రావు, వీరయ్య అనే ఇద్దరు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం మోహన్‌రావుకు గతేడాది నవంబర్ 23వ తేదీన సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.24 వేల చెక్కు వచ్చిందని, అలాగే వీరయ్యకు ఈ ఏడాది జనవరి 4వ తేదీన రూ.52 వేల చెక్కు వచ్చిందని తెలిపారు. గ్రామంలోని కొంతమంది రాజకీయ నాయకులు తాము అధికార పార్టీ నాయకులం కాదని చెక్కులు ఇవ్వడం లేదని అంటున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు తక్షణమే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయాలని వారు కోరారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



పాలకవీడు : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంజిరెడ్డి

పాలకవీడు : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాలకవీడు, యల్లాపురం, సజ్జాపురం, హనుమయ్యగూడెం, కోమటికుంట, నాగిరెడ్డిగూడెం, బొత్తలపాలెం, జాన్‌పహాడ్, గుడుగుంట్లపాలెం, రాఘవపురం గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.6,92,000ల విలువ గల చెక్కులను వారి కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి, తాటికొండ వెంకట్‌రెడ్డి, పసుపులేటి సైదులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేరేడుచర్లలోని రెండవ వార్డులో..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రెండవ వార్డులో లబ్ధిదారుడు చిత్తలూరి లక్ష్మీనారాయణకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.24 వేల సీఎం సహాయ నిధి చెక్కును మంగళవారం బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి సైదులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వింజమూరి రాములు, దొండపాటి సంజీవరెడ్డి, అప్పిరెడ్డి, చంద్రయ్య, సైదులు, శ్రీను ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిదని సర్పంచ్ షేక్ సలీమారంజాన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డలో లబ్ధిదారులకు మంజూరైన రూ.2 లక్షల 10 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు షేక్ అలీపాషా, గండు సైదులు, ఆవుల వెంకటయ్య, సైదులు, వెంకన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లులో గ్రామస్తులు వానరానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. ఆరు నెలల కిందట ఓ తల్లి కోతి గ్రామశివారులోని బాలేబోయిన రాజు పామాయిల్ తోటలోని బావిలోపడి చనిపోయింది. బావిచుట్టు తిరుగుతున్న కోతిపిల్లను గమనించిన లక్ష్మణ్, మహేష్, గోపి, వెంకటేష్‌లు మృతిచెందిన తల్లికోతిని బయటకు తీసి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం పిల్లకోతిని ఇంటికి తీసుకొచ్చి ఆలనపాలన చూసుకుంటున్నారు. సోమవారం ఎవరూ లేని సమయంలో ఆ కోతిపిల్లను కుక్కలు కారవడంతో మృతి చెందింది. దీంతో గ్రామస్తులు హిందూ సంప్రదాయంప్రకారం అంత్యక్రియలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ- మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.81 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రూపుదిద్దడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గెల్లి అర్చనరవి, జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, కౌన్సిలర్లు కేఎల్‌ఎన్‌రావు, గురవయ్య, త్రివేణి, సౌజన్య, కె.శ్రీను, శంబయ్య, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్, భాస్కర్, సతీష్, రాంబాబు, దయాకర్, ప్రదీప్, రాము, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. పట్టణ శివారులో ఇళ్ల స్థలాలు పొందిన జర్నలిస్టులు టీయూడబ్ల్యూజే –హెచ్–143 యూనియన్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే నూతన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను గజమాల, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే వారికి కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగగిరిలో గల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో రూ. 7. 49 లక్షలతో చేపట్టి పూర్తిచేసిన మన ఊరు- మన బడి అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, ఉపసర్పంచ్ రమ, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరబాబు, హెచ్‌ఎం వెంకటరెడ్డి, మునీర్, రమేష్, ధనలక్ష్మి, జ్యోతి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : ఎమ్మెల్యే సైదిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ దంపతులు

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పెండెం వారి ఆరాధ్య దైవమైన ఎల్లమ్మతల్లి పండుగను మంగళవారం ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ నివాసం సమీపంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పండుగకు ఎమ్మెల్యే సైదిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఎంపీపీ దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి, పెండెం వీరయ్య గౌడ్ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

చిలుకూరు : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా జరిగింది. 17 గ్రామాల సర్పంచ్‌లకు కేవలం ఇద్దరు మాత్రమే హాజరు కాగా, ఎంపీపీ బండ్ల ప్రశాంతీకోటయ్యతో పాటు బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆర్లెగూడెం, కొండాపురం ఎంపీటీసీలు నెమ్మాది సైదాబాబు, మద్ది పద్మ, గువ్వల జయమ్మ, బుడిగెం సైదమ్మలు హాజరుకావడంతో కోరం పూర్తియిందని సమావేశాన్ని ప్రారంభించారు. కాగా సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే పలువురు ప్రజాప్రతినిధులు వెళ్లిపోయారు. దీంతో సమస్యలపై చర్చ జరగలేదు. దాదాపు 10 శాఖల అధికారులు సమావేశానికి గైర్హజరయ్యారు. కాగా ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకొకసారి జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆమె మాట్లాడుతుండగానే నారాయణపురం సర్పంచ్ శంకర్ మధ్యలో జోక్యం చేసుకుని గ్రామ పంచాయతీ నుంచి చేసిన పనులకు నేటికీ బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీఓ ఈదయ్య స్పందించి గ్రామ పంచాయతీ పనులకు మండల పరిషత్‌కు ఎలాంటి సంబంధం లేదని చెక్ పవర్ మీకే ఉంటుందని నవ్వుతూ జవాబిచ్చారు. గట్టిగా అడిగితే తనిఖీ పేరుతో పంచాయతీ రికార్డులు తీసుకెళ్లడం, ఏదో ఒక కారణం చెప్పి సస్పెండ్ చేస్తామని అనడం అలవాటయిందని సర్పంచ్ శంకర్ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, తహసీల్దార్ రాజేశ్వరి, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యం

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాల ఎస్సీ కాలనీలో పది రోజుల క్రితం వీచిన భారీ ఈదురు గాలులకు ఓ విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడింది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపినా వారు చెట్టును తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెట్టు పచ్చిగానే ఉందని వర్షం వచ్చినపుడు కిందిభాగానికి విద్యుత్ వచ్చి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న పిల్లలు ఆడుతుంటారని, గేదెలు కూడా తిరుగుతుంటాయని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే చెట్టును తొలగించాలని కోరుతున్నారు.



చిమిర్యాలలో స్తంభంపై విరిగిపడిన చెట్టు

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరవధిక సమ్మె

కోదాడరూరల్ : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, వీరబాబు, నాగలక్ష్మి, కావ్య, అవినాష్, కవిత, జీవిత, స్వాతి తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా చింతలపాలెంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె 5వ రోజు కొనసాగింది. దీనిలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో శాంతియుతంగా నిరసన తెలిపారు. వీరికి తమ్మారం సర్పంచ్ సంఘీభావం తెలిపి దీక్షా శిబిరంలోనే భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, జేపీఎస్, ఓపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వారు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆర్ సైదా విజయ్, శివ, సుమిత్ర, రమ్య, సాజియాబేగం, నరేష్, సాయి బాబా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం స్థానిక ప్రధాన రహదారిపై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చంటి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, ప్రవీణ్, ఉమ, జైనస్‌రాజు, కవిత, నాగిరెడ్డి ఉన్నారు.



కోదాడరూరల్ : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మేళ్లచెరువు : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు మంగళవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. డీవైఎఫ్ఐ నాయకులు, జేపీఎస్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంఘీభావం

మోతె : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మంగళవారం మోతె మండల మల్టీపర్పస్ వర్కర్స్, సీఐటీయూ నాయకుడు రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీష్‌రెడ్డి, సంపత్, నాగరాజు, పూర్ణచందర్, సింధు, కవిత పాల్గొన్నారు.



మఠంపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం

చిలుకూరు : మండల పరిషత్ కార్యాయలం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె అయిదవ రోజుకు చేరుకుంది. మంగళవారం కార్యదర్శుల సమ్మెకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్ వర్మ, సారిక, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామారావు, శోభన్‌బాబు, కార్తిక్, కవిత, నవీన్, అవినాష్‌రెడ్డి, అంజయ్య, ప్రవళిక, సౌమ్య, ఆకాంక్ష పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

పాలకవీడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆయన వెంట నాయకులు పగడాల మట్టేష్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

మఠంపల్లి : విద్యార్థులు వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని స్థానిక ఎస్ఐ ఇరుగు రవితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిబిరం ఉంటుందని, ప్రస్తుతం 70 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బీవీ.రామారావు, మాజీ సర్పంచ్‌లు కృపానందం, సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామచంద్రయ్య, శేషిరెడ్డి, సురేష్‌గౌడ్, సీతారామిరెడ్డి, బాలక్రిష్ణగౌడ్, రోషిరెడ్డి, రమేష్, గోపి, రాజేష్, వీరస్వామి, పందు, సతీష్, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



మఠంపల్లి : వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ రవి

అల్లీపురంలో..

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వేసవి ఖోఖో క్రీడా శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం వి.చిరంజీవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా యువజన క్రీడల అధికారి సహకారంతో స్థానిక పాఠశాల పీఈటీ వి.మైసయ్యగౌడ్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, పాపారావు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.